

అన్నంలోకి పెరుగు వడ్డించి వెనుతిరిగి వెళ్ళిపోతున్న రాజ్యలక్ష్మి చెంగుపట్టి లాగాడు -విశ్వనాథం.

పైట చెంగు ఏ కుర్చీకో, మరింక దేనికో తగులుకుందేమోనని వెనుతిరిగి చూసిన రాజ్యలక్ష్మికి భర్త చేతిలో తన పైటచెంగు, అతని పెదవులమీద చిర్నవ్వు, రా రమ్మని సంజ్ఞలు చేస్తున్న కళ్ళు చూసి ఆమె వదనంలో చిరుకోపం, ఆశ్చర్యం కలబోసుకున్నాయి. ఆ వెనువెంటనే వస్తున్న నవ్వును మూతి బిగింపుచే అదిమి విశ్వనాథానికి దగ్గరగా వచ్చి "లోపల పిల్లలున్నారు...." గొంతు తగ్గించి అంది.

"ఆ విషయం నాకు తెలుసు, ఈరోజైనా ఈ దేవికి దయకలుగుతుందా అని..." ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"ఏంటండీ మీరిలా తయారయ్యారు! ఈ రెండ్రోజుల్నుంచి చూస్తున్నాను ఊరికే ఇదైపోతున్నారు." పైటచెంగు చుట్టూ తిప్పి నడుముకి ఒకపక్క దోపుతూ అంది రాజ్యలక్ష్మి.

"నేనేం తప్పుచేసానోయ్! నా పెళ్ళాన్ని ముట్టుకోవడం తప్పేనా?" అమాయకంగా అన్నాడు విశ్వనాథం.

# మనసున మనసై...

## అభిమన్యు

"ముట్టుకుంటే బాగానేఉండ్ను, అయినా ఉదయం మీరు చేసినపనేంటండి? నేను వంటింట్లో ఉంటే వెనుక మీరు వచ్చి గట్టిగా వాటేసుకుంటారా! నడుం పట్టేసింది, తెలుసాండి! హవ్వ! పిల్లలెవరూ చూడ లేదు గాబట్టి సరిపోయింది, అయినా ఈ వయస్సులో ఇదేంపనండి!?" ఉదయం వంటింట్లో జరిగిన సంఘటన గుర్తుకివచ్చి ఒక చేత్తో నడుంమీద రాసుకుంటూ అంది రాజ్యలక్ష్మి.

"వయస్సుతో పనేంటోయ్! మనస్సు ప్రధానం, తలలు బోడులైనంతమాత్రాన తలపులు బోడు లవునా!"

ఆమె నడుంమీద చెయ్యివేసి తన వైపుకు లాక్కున్నాడు విశ్వనాథం.

"ఆ! ఆ! కబుర్లు బాగా చెబుతారు, తర్వాత నడుం నెప్పని పడుకోగలరు" ఈలోగా కొడుకు పిలవ డంతో "ఉండండి, పిల్లలు బయలు దేరుతున్నట్లుగా ఉంది వస్తాను." అంటూ అటు పరిగెత్తింది రాజ్య లక్ష్మి.

ఉగాదికి అత్తారింటికి వెళ్తున్న కొడుకూ కోడలూ మనుమడూ మనుమరాలుని చూసి "జాగ్రత్తరా అబ్బాయి! రాత్రిపూట ప్రయాణం పెట్టుకున్నావు. పోనీ ఆ వంటేదాన్ని ఉంచేయరాదురా! ఈ రెండు రోజులూమాకు సరదాగా గడిచిపోతుంది" రాజ్యలక్ష్మి అంది.

"ఎందుకమ్మా అది అసలే గడుసుది. మీ ఇద్దర్నీ ఒక ఆట ఆడిస్తుంది. అయినా రేపు ఉదయం చెల్లాయ్, బావగారు, పిల్లలు వస్తున్నారుగదా! ఇంక మీకు ఏదిగులూ ఉండదు, మేము లేనిలోటు చెల్లాయ్ వాళ్ళు తీరుస్తారులే" సామాన్లు ఆటోలో పెడ్తూ అన్నాడు రాజు.

"వాళ్ళని వెళ్ళనీవే, ట్రైన్‌కి టైమవుతుంది. ఓరేయ్ రాజు! నువ్వు బయల్దేరరా మీ అమ్మ సంగతి తెలిసిందేగా!" తాంబూలం నములుతూ అన్నాడు విశ్వనాథం.

విశ్వనాథం, రాజ్యలక్ష్మి ఆటో కదిలేవరకూ అక్కడే ఉన్నారు. "చూడండి ఇల్లు ఎలా బోసిపో యిందో ఇంతలోనే!" అనుకుంటూ రాజ్యలక్ష్మి లోనికి నడిచింది.

"కార్యేషు మంత్రి, శయనేషు రంభ," అన్నట్టు కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, తనకు చేదోడు వాదోడుగా ఉంటూ, తన ఆశలు ఆశయాలు తెలుసు కొని నడుచుకొనే భార్య దొరికినందుకు విశ్వనాథం ఎంతో ఆనందపడిపోతు ంటాడు.

విశ్వనాథంకి కొడుకూ కూతురూ తను టీచర్‌గా ఉంటూ జీవితంలో ఏవీ సంపాదించలేదు. "నాకు నగలెందుకండీ? మీ చిర్నవ్వే నాకు నగలు, మీ ఆత్మీయతాఆదరణలే నాకు పట్టువస్త్రాలు..." అని సంతృప్తి చెందే భార్యంటే విశ్వనాథంకి గర్వం.

కొడుక్కు ఉద్యోగం వచ్చాక కూతురికి పెళ్ళి చేసాడు. ఆ తరువాయి సంవత్సరంలో కొడుక్కి కూడా పెళ్ళి చేసేసాడు. తను రిటైర్ అవ్వగా వచ్చిన డబ్బుతో ఆ రెండుగదుల ఇంటిని కొన్నాడు. ఒక గది కొడుక్కు, కోడలుకి కేటాయిస్తే మరోగదిమనవడు, మనవరాలితో ఈ ముసలి దంపతులకి. ఎప్పుడైనా కూతుర్తూ అల్లుడూ వచ్చారంటే ఇహవీరికి వీధి గుమ్మమే గతి.

అందం అనేది చూసే కళ్ళమీద, వాంఛించే మనస్సుమీద ఆధారపడి వుంటుంది. ఇప్పుడు అందంగా కనిపించే వ్యక్తియైనా, వస్తువైనా మరో రోజుకి అందంగా కనిపించక పోవచ్చు. అది దృష్టి దోషమే కానివ్వండి, చంచలమైన మనస్తత్వమే కానివ్వండి.

ఈ మధ్య విశ్వనాథం కంటికి రాజ్యలక్ష్మి అందంగా ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఆమెను చూస్తుంటే ఏవేవో కోరికలు అతనిలో చెలరేగు తున్నాయి. అయితే తగ్గ అవకాశం, సమయం కలసి రావడం లేదు. తను చొరవ తీసుకొని భార్యతో ఏదైనా ముచ్చటిద్దామంటే సరైన ఏకాంతం లభించడం లేదు.

పోనీ ఏ రాత్రి పూటైనా కాస్త మోహం పెరిగి, కోరిక కలిగి భార్యను దగ్గరికి తీసుకుందామంటే ఈలోగా పక్కన పడుకున్న మనవడో, మనవరాలో మంచినీళ్ళకనో, ఒంటేలుకనో లేవడం, దగ్గడం, తుమ్మడంతో ఉవ్వెత్తున సముద్ర కెరటాల్లా ఎగిసి పడుతున్న కోరికలకి బలవంతాన కళ్ళెం వేయాల్సి వచ్చేది.

విశ్వనాథానికి ఈరోజు చాలా ఆనందంగా వుంది.

15-12-89 ఆంధ్రజ్యోతి వారపత్రిక



చాలారోజులకి ఏకాంతంగా తన కాంతను దగ్గరికి తీసుకొని చిలకా గోరింకల్లా, నూతన దంపతుల్లా ముచ్చటించుకునే అవకాశం దొరికినందుకు చాలా ఉత్సాహంగా ఉంది.

కొడుకూ కోడలూ పిల్లలూ ఉగాదికి అత్తారింటికి వెళ్ళారు. తెల్లారితే కూతురు, అల్లుడు, పిల్లలు వచ్చేస్తారు. ఎంతైనా ఈ రాత్రి వారి వలపులు పండించుకునే రాత్రి. వారి కోరికలు కదం తొక్కే రాత్రి.

మంచం మీద పడుకుని, కళ్ళు మూసుకుని కలగబోయే ఆనందం గూర్చి ఆలోచిస్తున్న విశ్వనాథం తలుపు దగ్గర చప్పుడవ్వడంతో అటు చూసాడు.

ద్వారందగ్గర రాజ్యలక్ష్మి చిలకాకు పచ్చ చీరలో ఆకాశం నుండి దిగివచ్చిన దేవదూతలా, మబ్బుల చాటున తళుక్కుమన్న మెరుపు తీగలా వుంది. ఆమెను చూసేసరికి విశ్వనాథం గుండె క్షణకాలం స్తంభించి, మరుక్షణం రెట్టింపు వేగంలో కొట్టుకోసాగింది.

"ఎంతందంగా ఉన్నావ్ రాజ్యం! మన మొదటి రాత్రులు గుర్తుకి తెస్తున్నావు. ఒక్కసారిగా నా మనస్సును ముప్ఫై సంవత్సరాల వెనక్కు తీసుకుపోతున్నావు..." విశ్వనాథం తన్మయత్వంతో ఆమె భుజాలు పట్టుకొని దగ్గరికి తీసుకొని ఆబగా, తనివి తీరా కౌగిలించుకున్నాడు.

ఏదో వేళకి ఇంత తినటం, పడుకోవటం, లేవటం, వంటావార్పు, పిల్లల కేరింతలు, నవ్వుల్తో యాంత్రికంగా జీవితం వెళ్ళబుచ్చుతున్న రాజ్యలక్ష్మికి దోసెడు పున్నాగ పూలు మీద జల్లినట్లు, పారిజాత సౌరభాలు గుప్పుమన్నట్లు హృదయంలో ఏదో తెలియని పులకింత. శరీరం పూలతెప్పలా తేలుతున్నట్లనిపించి అలాగే భర్త గుండెల్లో గువ్వలా ఒదిగిపోయింది.

విశ్వనాథం ఆమెను మెల్లగా నడిపించుకువచ్చి మంచం మీద కూర్చోబెట్టి పక్కనే తనూ కూర్చున్నాడు.

రెండు చేతులలో ఒడిసిపట్టుకొని తనవైపే చూస్తున్న భర్త కళ్ళల్లోకి చూసే ధైర్యం చాలక, సిగ్గుతో తలదించుకుంది రాజ్యలక్ష్మి.

"రాజ్యం! ఏదీ ఇటుచూడు!" ఆమె చుబుకాన్ని తన కుడిచేతి చూపుడు వేలుతో ఎత్తి "ఎన్నాళ్ళయ్యింది రాజ్యం నిన్ను ఇంత దగ్గరగా చూసి! ఆ సోగకళ్ళు, తెల్లబడ్డ నొక్కుల జుట్టు, సన్నని వంపు తిరిగిన పెదవులు... కొద్దిగా ఒళ్ళు చేసావు తప్ప నీలో పెద్ద మార్పేమీ లేదు. నా మనస్సు ఎంత ఆనందంగా ఉందో తెలుసా!" అన్నాడు.

రాజ్యలక్ష్మి తలెత్తి భర్తవైపు చూసి పెదవి విరిచింది. పెళ్ళి అయిన కొత్తలో ఎంతందంగా ఉండేవారు! ఆరడుగుల ఎత్తు, నుదుటి మీద పడుతున్న జుత్తు. ముందుకుసాగిన ముక్కు, సన్నని మీసం, మధ్యకి చీలిన గడ్డం. ఇప్పుడు! అప్పటి శరీర సౌష్టవం, కాంతి పోయింది. తలనెరిసింది. ముక్కు మీదకి జారుతున్న జోడులో తాయిలం కోసం ఆశగా చూస్తున్న బాలుడిలా చూస్తున్న భర్తను చూసేసరికి రాజ్యలక్ష్మి గుండె ద్రవించిపోయింది. ఒక ఇంట్లో ఉంటూ, ఎదురెదురుగా తిరుగుతూ ఇతగాడి కోరికలు, ఆశలు తెలుసుకోక ఎంత నిర్లక్ష్యంగా తిరిగాననే బాధతో ఆమె హృదయం మూగగా రోదించసాగింది. ఆకస్మికంగా ఆమెకి తెలియకుండానే ఆమె కన్నులు జలజలా కన్నీటిని రాల్చాయి.

"రాజ్యం! ఎందుకే పిచ్చి మొహమా! అలా బాధపడ్తావ్. నాకేమీ సుఖసౌఖ్యాలు చూడడం లేదనే కదూ నీ బాధ! ఇన్నాళ్ళ మన కాపురంలో నువ్వేమిటో నాకు తెలియదా! ఆ... ఏది ఇటుచూడు. ఈ రాత్రి మనకు ఎంతో విలువైనది. ఏదీ నవ్వు! నవ్వాలి, నీవు నవ్వితే రాలే ముత్యాల్ని ఈ చేతులతో ఏరుకోనీ".

విశ్వనాథం అలా అనగానే రాజ్యలక్ష్మి నవ్వింది. విరగబడి నవ్వింది. తనివితీరా నవ్వింది. ఆమె నవ్వంటే విశ్వనాథానికి ఎంతో ఇష్టం. చల్లని పిల్ల తెమ్మెర తనని స్పృశించినట్లు, మల్లెల గుబాళింపు తన గుండెల్ని తాకినట్లు, వేసవిలో సన్నని వానలో తడుస్తున్నట్లు హృదయమంతా ఏదో పులకింత.

రాజ్యలక్ష్మిని మంచం మీద పడుకోబెట్టి పూలపై వాలే తుమ్మెదలా ఆమె గుండెల మీద వాలిపోయాడు విశ్వనాథం. అతని కళ్ళ నిండా ఆమె రూపమే! ముద్దమందారంలా గోచరిస్తున్న ఆమె శరీరాన్ని తన చేతులతో తనివితీరా స్పృశిస్తున్నాడు.

యవ్వనపు తొలిరోజుల్లో, పెళ్ళి అయిన కొత్తలో చెప్పుకున్న ఊసులు, చేసుకున్న పనులు, మనస్సు పొరల్లో మరుగున పడిన తీయటి జ్ఞాపకాల్ని నెమరు వేసుకుంటున్నారు. ప్రేమతో, అభిమానంతో, ఆత్మీయతతో ఒకర్నొకరు కోరుకుంటున్నారు.

అతని చేతులు ఆమె శరీర భాగాన్ని మీటుతుంటే ఆమె నరాలు తీయని రాగాలు పలికిస్తున్నాయి. ఆమె అరవిరిసిన గులాబీలా అతన్ని ఆహ్వానిస్తుంటే అతను దాహంతో, తమకంతో ఆమెను అల్లుకుపోవాలనుకున్నాడు...

కానీ... బయట ఆగకుండా మోగుతున్న కాలింగ్ బెల్ అతన్ని ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది.

స్వర్గలోకపు మెట్ల నుంచి ఎవరో నరకకూపంలోకి తోసి వేసినట్లు, మత్తుగా, తృప్తిగా మకరందం గ్రోలే తుమ్మెద రెక్కలు విరిచేసినట్లు విశ్వనాథం నిరాశతో మంచం మీద వాలిపోయాడు.

రాజ్యలక్ష్మి వెళ్ళి తలుపుతీసింది.

"అబ్బబ్బ! ట్రైన్‌లేటు కాదు గానీ మా ప్రాణాలు తోడేసింది..." అంటూ కూతురూ, అల్లుడూ, పిల్లలూ లోనికి వచ్చారు.

"అదేంటి రమా! రేపు కదా వస్తామన్నారు?" ఆశ్చర్యంగా వాళ్ళని చూస్తూ అడిగింది రాజ్యలక్ష్మి.

"రేపే వద్దామనుకున్నామండీ. ఇదిగో మీ అమ్మాయి అప్పటికప్పుడు బయలుదేరింది..." అల్లుడు ఎంతో వినయంగా సమాధానమిచ్చాడు.

*** *** ***

భళ్ళున తెల్లారింది. వెలుగు రేఖలు లోకమంతా పరుచుకుంటున్నాయి. అప్పుడే ఉదయించిన భానుడు తన లేత కిరణాలతో లోకాన్ని ఆవరించి ఉన్న చీకటిని పారద్రోలడానికి సంసిద్ధుడై వస్తున్నాడు.

విశ్వనాథం డ్రెస్ చేసుకొని ఎక్కడికో బయలుదేర బోతుంటే రాజ్యలక్ష్మి ఆ గదిలోకి వచ్చింది. అతని కళ్ళల్లో కాంతిని, ముఖంలో ప్రశాంతతని చూసేసరికి ఆమె మనస్సు కాస్త కుదుటపడింది.

"నామీద కోపమా?"

బేలగా చూస్తూ, అమాయకంగా అడుగుతున్న భార్యను చూసేసరికి విశ్వనాథం పెదవుల మీద చిర్నవ్వు వెలిసింది.

"పిచ్చి రాజ్యం! నీ మీద నాకు కోపం దేనికోయ్! జీవితానికి సెక్స్ అవసరం. కానీ, సెక్సే జీవితం కాదు. యవ్వనంలో సెక్స్‌కి ఇచ్చినంత ప్రాధాన్యత దేనికీ ఇవ్వం. తర్వాత వయస్సు మీద పడ్డాక, పిల్లలు పుట్టాక బాధ్యలు తెలిసాక ఆ పొంగు, ఆ కోరిక క్రమంగా చల్లారుతుంది. మనిషికి మనిషి తోడు కావాలి. మనస్సుకి మనస్సు తోడు కావాలి. ఈ వయస్సులో దాని గురించి ఆలోచించడం అవివేకమనిపించుకుంటుంది. ఏ వయస్సులో జరగాల్సిన ముచ్చట ఆ వయస్సులో జరిగితేనే అందం, ఆనందం. ఇహ మనం ఆనాటి తీయటి జ్ఞాపకాల్ని, అనుభూతుల్ని, అనుభవాన్ని నెమరు వేసుకుంటాం. మన పిల్లల బాగోగులు చూస్తూ కాలం గడపవలసిందే. మన పిల్లలు పిల్లల్ని కంటున్నారు" అంటూ విశ్వనాథం రాజ్యలక్ష్మిని తన గుండెల్లో దాచుకున్నాడు.